క్లుప్తంగా

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే శంబంగిని కలిసి, పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కార్యదర్శులు

బొబ్బిలి: గ్రేడ్‌–5 కార్యదర్శులకు డీడీవోలుగా బాధ్యతలు అప్పగించడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును మంగళవారం కార్యదర్శులంతా కలిసి, ప్రభుత్వానికి, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నిన్నమొన్నటి వరకున్న క్లస్టర్‌ వ్యవస్థను రద్దు చేసి, కొత్తగా డీడీవోలుగా ప్రకటిస్తూ జీవో జారీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌ ముజీబ్‌, సింహాచలం, రాజేష్‌, లక్ష్మణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రాజాం సిటీ: మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రాజాం టౌన్‌ సీఐ కె.రవికుమార్‌ మంగళవారం తెలిపారు. స్థానిక వాసవీనగర్‌లో నివాసముంటున్న ఓ మహిళను తెర్లాం మండలంలోని కాగాం గ్రామానికి చెందిన జిల్లెల రాజేంద్ర ప్రతిరోజూ వెంటపడి వేధిస్తున్నట్లు బాధిత మహిళ ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇద్దరికి గాయాలు

బొబ్బిలి: మండలంలోని వాకాడవలస వద్ద మంగళవారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో కలువరాయి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న రాముడువలసకు చెందిన సురగాల మోహనరావు, పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం బర్లి నుంచి ఎదురుగా వస్తున్న రామచంద్రరావుకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి వైద్య చికిత్స అందజేశారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్‌ రాజేశ్వరరావు

బొబ్బిలి: మండలంలోని కలువరాయి గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో భూముల రీసర్వేను ప్రారంభించి, అనంతరం నిర్వహించిన గ్రామసభలో డోల రాజేశ్వరరావు మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. ఎన్నో దశాబ్దాలుగా నెలకొన్న భూ తగాదాలు ఈ సర్వేతో పరిష్కారమవుతున్నాయన్నారు. అలాగే రైతులకు తమ భూములపై శాశ్వత హక్కు లభిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్‌ బీమా నగదు అందజేస్తున్న జెడ్పీ వైస్‌ చైర్మన్‌ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: మండలంలోని ఇజ్జిపేట గ్రామంలో చిటికం రాంబాబు ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు ఆమె భార్య పద్మావతికి వైఎస్సార్‌ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను జెడ్పీ వైస్‌ చైర్మన్‌ సిరిపురపు జగన్‌మోహన్‌రావు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. మిగిలిన మొత్తాన్ని మరికొన్ని రోజుల్లో నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు



అమ్మవారికి ముర్రాటలు సమర్పిస్తున్న భక్తులు

రాజాం: మండలంలోని ముద్దాడజోగివలస గ్రామంలో గ్రామదేవత అసిరితల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. అనంతరం అమ్మవారి గుడి వద్దకు చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యం



మెంటాడ: మీసాలపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, జెడ్పీ చైర్మన్‌ శ్రీనివాసరావు

ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలకు వచ్చిన రోగులకు వైద్యులు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రులకు రిఫర్‌ చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ప్రజలకు ఆరోగ్య భరోసానిచ్చే ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు.

– సాక్షి నెట్‌వర్క్‌



తెర్లాం: చీకటిపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్‌ రత్నకుమార్‌



రాజాం: గురవాంలో వైద్య తనిఖీలకు వచ్చిన వృద్ధులు



వంగర: అరసాడ వైద్య శిబిరంలో బీపీ తనిఖీ చేయించుకుంటున్న ఎమ్మెల్యే కంబాల జోగులు పక్కనే ఎమ్మెల్సీ విక్రాంత్‌



బొబ్బిలి: పారాదిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రామభద్రపురం: బూసాయవలసలో వైద్య శిబిరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు



బాడంగి: బొత్సవానివలసలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామారావు



రేగిడి: చాటాయివలసలో వైద్య శిబిరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ ఆవశ్యకతను వివరిస్తున్న ఎమ్మెల్యే జోగులు, పక్కనే ఎమ్మెల్సీ విక్రాంత్‌

గడప గడపకూ సంక్షేమం



రేగిడి: ఖండ్యాంలో ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



తెర్లాం: చిననందబలగలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తూ బుక్‌లెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు


రేగిడి: ప్రభుత్వ పథకాలతో ప్రతీ ఇంటికి సంక్షేమం అందించిన ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు, జన్మభూమి కమిటీలు సూచించిన వారికే పథకాలు దక్కేవన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హులై ఉంటే చాలని, పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతీ ఇంటికి ఈ నాలుగున్నరేళ్లలో రూ.లక్ష నుంచి రూ.4 లక్షలకు పైగా లబ్ధి జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించి, ప్రజాధనాన్ని దోచుకున్న టీడీపీ నేతలను నమ్మవద్దన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు అవినీతి చేసి, జైలుకు వెళ్తే ప్యాకేజీ స్టార్‌ పవన్‌ కల్యాణ్‌ ఆయన ఇచ్చే ప్యాకేజీకి ఆశపడి ఆయనను సమర్థిస్తూ మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఇదంతా రాష్ట్ర జనం గమనిస్తున్నారని ఇరువురికీ వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ జి.వెంకటేశ్వరరావు, వైస్‌ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, మాజీ పీఏసీఎస్‌ చైర్మన్‌ జి.జగ్గున్నాయుడు, పోలేటి వెలమ రాష్ట్ర డైరెక్టర్‌ కె.సురేష్‌కుమార్‌, సర్పంచ్‌ కె.వెంకటేశ్వరరావు ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్‌ సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు..

తెర్లాం: కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందబలగ గ్రామ సచివాలయం పరిధిలోని చిన నందబలగ, రామన్నవలస గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని వివరించారు. రాష్ట్రాన్ని 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు ప్రజాధనం దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఓ వైపు ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రతీ ఇంటికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు పొందాలన్నా మండల కేంద్రాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్‌ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వాన్నే ఆశీర్వదించి, మళ్లీ సీఎం జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి ఎస్‌.వేణుగోపాలనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్‌ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు, ఎంపీడీవో ఎస్‌.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

వంగర: వరి పంటను ఆశిస్తున్న తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో తట్టికోట కన్నబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని మద్దువలస గ్రామ పొలాల్లో వరి పంటను పరిశీలించిన ఆయన ఎంటీయూ–1121, సంపద స్వర్ణ రకాలకు ఎండుతెగులు, పాముపొడ తెగులు సోకినట్లు గుర్తించారు. ఎండుతెగులు నివారణకు ప్లాంటోమైసిన్‌ 100 గ్రాముల పౌడర్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలానికి పిచికారీ చేయాలని, పాముపొడ తెగులు నివారణకు హెక్సాకొనజోల్‌ 400 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో పిచికారీ చేస్తే నివారించవచ్చన్నారు. మందును పిచికారీ చేసిన వారం రోజుల్లో తెగుళ్ల నివారణ సాధ్యంకాకపోతే మరోసారి అదే మోతాదులో పిచికారీ చేయాలన్నారు. అలాగే నత్రజని ఎరువుల వాడకం తగ్గించాలన్నారు.



తెగులు సోకిన వరిదుబ్బును పరిశీలిస్తున్న ఏవో కన్నబాబు

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

రాజాం సిటీ:

ఉద్యోగం చేస్తున్న సమయంలో ప్రజలకు అందించిన సేవలతోనే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీవో బాసూరి శంకరరావు, నందబలగ సర్పంచ్‌ కొర్ను ఈశ్వరరావు అన్నారు. మండలంలోని నందబలగ గ్రామంలో గ్రామ కార్యదర్శిగా పనిచేసి ఈవోపీఆర్‌డీగా పదోన్నతిపై నరసన్నపేటకు ఇటీవల బదిలీ అయిన జి.రామకృష్ణను మంగళవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌ బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణను సత్కరిస్తున్న సర్పంచ్‌ ఈశ్వరరావు తదితరులు

నేడు 'జగనన్నకు చెబుదాం'

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బాసూరి శంకరరావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి కలెక్టర్‌ నాగలక్ష్మి హాజరై, వినతులు స్వీకరిస్తారని, ప్రజలు వచ్చి, తమ సమస్యలు విన్నవించుకోవాలన్నారు.

శతశాతం పనుల కల్పనే లక్ష్యం

రాజాం సిటీ: గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు శతశాతం పనులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ లావేటి సులోచన అన్నారు. మంగళవారం మండలంలోని గడిముడిదాం గ్రామంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, పనుల గుర్తింపు– పనుల నిర్వహణపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు గతేడాది చేసిన 91 పనులపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ రూరల్‌ కన్వీనర్‌ ఎల్‌.రాజగోపాలనాయుడు, ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌

రేగిడి: రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో నెలకొల్పిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ అన్నారు. మంగళవారం మండలంలోని చాటాయివలస గ్రామంలో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. అలాగే వలంటీర్‌ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు పారదర్శకంగా అందుతున్నాయన్నారు. ఆయా వ్యవస్థల పనితీరుతో ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారన్నారు. ఇవే వ్యవస్థలతో ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం జరిగిందన్నారు. ప్రధానంగా పాలన సులభతరమైందన్నారు. ఈ ఘనత అంతా ఒక్క ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మన రాష్ట్రంలోని సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేందుకు మరెన్నో రాష్ట్రాలు ఆలోచన చేస్తున్నాయన్నారు. సచివాలయాల ద్వారా గ్రామస్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్‌ సీపీనే గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.అప్పలనరసమ్మ, వైస్‌ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహనరావు, సర్పంచ్‌లు కె.గోవిందరావు, జి.రమణ, ఎంపీటీసీ పి.అప్పలనాయుడు, ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్‌ సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.



చాటాయివలస గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌

శరవేగంగా అభివృద్ధి పనులు

- పంచాయతీరాజ్‌ డీఈఈ అప్పారావు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ నాలుగేళ్లలో బొబ్బిలి నియోజకవర్గంలో దాదాపు రూ.256.71 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పంచాయతీరాజ్‌ డీఈఈ అప్పారావు తెలిపారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులతో పాటు ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్‌ సెంటర్ల భవనాలు వంటి మొత్తం 383 పనులు జరుగుతున్నాయని, అలాగే 288.97 కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీటిలో ఇప్పటివరకు 133 పనులు, 120.40 కిలోమీటర్ల రోడ్లు, కాలువల నిర్మాణాలు జరిగాయన్నారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.149.89 కోట్లు, ప్రధానమంత్రి సడక్‌ యోజన నిధులు రూ.16.15 కోట్లు, ఏపీఆర్‌ఆర్‌పీ నిధులు రూ.73.07 కోట్లు, ఏఎంసీ నిధులు రూ.12.30 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.4 కోట్లు, జిల్లా పరిషత్‌ జనరల్‌ ఫండ్‌ నిధులు రూ.1.22 కోట్లు, ఎంపీ ల్యాడ్‌ నిధులు రూ.39.74 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూస్తున్నామన్నారు.



కొట్టక్కి గ్రామసచివాలయ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న పీఆర్‌ డీఈఈ అప్పారావు

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

రాజాం: పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించాలని మున్సిపల్‌ కమిషనర్‌ డీటీవీ కృష్ణారావు సూచించారు. ఇదే విషయమై స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో రాజాం ప్రభుత్వాస్పత్రి వైద్యులు, రాజాం పట్టణ పీహెచ్‌సీల వైద్యులు, వార్డు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులతో మంగళవారం సమావేశమైన ఆయన ఈ నెల 5, 12వ తేదీల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అందరికీ అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. రక్తపరీక్షల కిట్లు, మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌ సీపీ రాజాం టౌన్‌ కన్వీనర్‌ పి. శ్రీనివాసరావు, మున్సిపల్‌ కార్యాలయ మేనేజర్‌ ఎం.వి.నాగరాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వైద్యారోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్‌ కమిషనర్‌ కృష్ణారావు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. తొలుత ప్రకృతి వ్యవసాయ రథచక్రం ముగ్గును వేసి, పంటల వివరాలు, వనరులు, సాగు ఫలితాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంవో రేఖ, మాస్టర్‌ ట్రైనీ కిరణ్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

రాజాం:

స్థానిక పట్టణంలో దోమల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ ప్రసాద్‌ తెలిపారు. స్థానిక పెద్దహరిజన వీధితో పాటు ఆ వీధి పరిసర ప్రాంతాల్లో మంగళవారం యాంటీ లార్వా ఆపరేషన్‌ నిర్వహించారు. మున్సిపల్‌ కమిషనర్‌ డీటీవీ కృష్ణారావు ఆదేశాలతో దోమలు లేకుండా అన్ని వార్డుల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్‌ చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు కూడా మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.



వీధుల్లో యాంటీ లార్వా స్ప్రేయింగ్‌ చేయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌

సందడిగా వినాయక నిమజ్జనం

తెర్లాం: మండల కేంద్రంలో వినాయక నిమజ్జనోత్సవాలు మంగళవారం చాలా సందడిగా జరిగాయి. సాయంత్రం గణేశుని విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. ఈ క్రమంలో డీజే పాటలకు యువతీయువకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.